తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
20 సెప్టెంబర్ 2026
పేజీలు : 8








## ఉచిత బస్సు.. ఆటో కార్మికుల బతుకులకు గండి!

- గిరాకీ తగ్గి కుటుంబ పోషణ భారంగా మారింది..
- మారుమూల ఏజెన్సీ గ్రామాలకు బస్సులు పెంచాలి..
- మణుగూరు-భద్రాచలం రూట్ లో అవసరానికి మించిన సర్వీసులు తగ్గించి ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మళ్లించాలి..
- ఏటా రూ.12 వేల సాయం.. ఉచిత ప్రమాద బీమా, రోడ్‌టాక్స్ మినహాయింపు కల్పించాలి..

**అశ్వాపురం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రావడంతో తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆటో రిక్షా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజువారీ ప్రయాణికుల గిరాకీతో కుటుంబాలను పోషించుకున్న తమకు ప్రస్తుతం కిరాయిలు తగ్గిపోవడంతో ఆటో ఫైనాన్స్, ఇంధనం, ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించడం భారంగా మారిందని చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల వారికి రవాణా ఖర్చు తగ్గుతున్నప్పటికీ, దాని ప్రభావంతో ఆటోలపై ఆధారపడే ప్రయాణికుల సంఖ్య తగ్గిందని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే క్రమంలో తమ జీవనోపాధి కూడా దెబ్బతినకుండా సమతుల్య విధానం అవసరమని వారు కోరుతున్నారు.

**అవసరమున్న ప్రాంతాలకు బస్సులు మళ్లించాలి:**
మణుగూరు డిపో పరిధిలోని మారుమూల వార్తా లోపలి పేజీలో

### జొన్న రొట్టెల ముసుగులో
# నాటు సారా దందా..!




- చండూరు మున్సిపాలిటీలో సరికొత్త పంథాలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా
- యథేచ్ఛగా సాగుతున్న నాటు సారా విక్రయాలు..
- తండాలను దాటి మున్సిపాలిటీకి పాకిన సారా మహమ్మారి..
- మామూళ్ల మత్తులో ఆబ్కారీ యంత్రాంగం..

**చండూరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)** ప్రభుత్వం నాటుసారాపై ఉక్కుపాదం మోపుతున్నామని ఘనంగా ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఒకప్పుడు మారుమూల అటవీ ప్రాంతాలు, గిరిజన తండాలకే పరిమితమైన నాటుసారా తయారీ, విక్రయాలు ఇప్పుడు ఏకంగా పట్టణ కేంద్రాలకు చేరాయి. నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ దందా సరికొత్త పంథాలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. వార్తా లోపలి పేజీలో

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ : ఎస్పై రాజీవ్ రెడ్డి




**కనగల్లు, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)** పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు ఎన్జీ కాలేజ్ ఆవరణలో జరిగే స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపికైన నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ ఇప్పించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పై కే రాజీవ్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలీస్ శాఖ త్వరలో నిర్వహించనున్న ఎస్పై, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకం లోపోటీపడుతున్న నిరుద్యోగుల కోసం శిక్షణ కేంద్రాలను నిర్వహించినట్లు తెలియజేశారు. పోటీ పరీక్షల లో విజయం సాధించడానికి అనుభవజ్ఞులైన కోచర్లచే సిలబస్ పై బోధన, పరీక్ష విధానంపై అవగాహన, నిపుణుల మార్గదర్శకత్వం తదితర అంశాలపై వివరించి ఎంపికైన నిరుద్యోగులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్లో కెళ్ళి మరింత సమాచారం తెలుసుకోవాలన్నారు.




### దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయడం
## ప్రజా స్వామ్యంలో ఒక మంచి పరిణామం
**అనర్హత వేటు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు**
**నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి**

**నేరేడుచర్ల సెప్టెంబర్19( జనంసాక్షి):** 22 ఏ భూముల పై అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుందో అనే భయంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే లను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని, దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హత వేటు కాంగ్రెస్ ప్రభుత్వం చెంపపెట్టని హుజూర్ నగర్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి అన్నారు.శనివారం నేరేడుచర్ల పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయడం ప్రజా స్వామ్యంలో ఒక మంచి పరిణామం అన్నారు.బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఫలించిందని, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఇదే గతి పడుతుందని వ్యాఖ్యానించారు.ఖాళీ అయిన స్థానానికి ప్రజాక్షేత్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధి చెబుతారని, వార్తా లోపలి పేజీలో

## రెడ్‌క్రాస్ ఎన్నికలకు తెర

- 15 మంది సభ్యులతో నాగేశ్వరరావు ప్యానల్.. 24న నామినేషన్లు..
- అక్టోబర్ 4న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు..

**భద్రాచలం సెప్టెంబరు 19 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టగా.. ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. పోటీ చేయనున్న అభ్యర్థులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ఈ మొత్తం తిరిగి చెల్లించబడదని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

**సేవా అనుభవంతో బరిలోకి..**
రెడ్‌క్రాస్ ఎన్నికల్లో చల్లగుళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 15 మంది సభ్యులతో కూడిన ప్యానల్ నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా భద్రాచలం ప్రాంతంలో పనిచేసిన సమయంలో పేదలు, సామాన్య ప్రజలకు వివిధ రూపాల్లో సేవలందించానని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఎనిమిది సార్లు ప్రశంసాపత్రాలతో పాటు నగదు పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. గోదావరి వరదలు, పుష్కరాలు, శ్రీరామ నవమి, ముక్కోటి ఉత్సవాల సమయంలో ప్రజలు, భక్తులకు సేవలందించినట్లు నాగేశ్వరరావు వివరించారు. ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా, పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడిగా, భద్రాచలం డివిజన్ కెమిస్ట్స్ కార్యదర్శిగా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్నానని చెప్పారు. వార్తా లోపలి పేజీలో

# జొన్న రొట్టెల ముసుగులో నాటు సారా దందా..!

స్థానికంగా బోర్డులపై జొన్న రొట్టెలు లభించును అని పెట్టి, లోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ఖాళీ క్వార్టర్ సీసాలో, 100 ఏంఎల్ కూల్ డ్రింక్స్ బాటిల్లలో నాటుసారా విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జొన్న రొట్టెలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే, ఈ ఆహార వ్యాపారాన్ని కేటుగాళ్లు తమ అక్రమ సంపాదనకు రక్షణ కవచంగా మార్చుకున్నారు. తాత్కాలిక షెడ్ల వద్ద జొన్న రొట్టెల అమ్మకాల పేరుతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. తెల్లవారు జాము నుంచే ప్రారంభమయ్యే ఈ దందా అర్ధరాత్రి వరకు నిరాటంకంగా కొనసాగుతోంది.

**రోడ్డున పడుతున్న నిరుపేద కుటుంబాలు**

చండూరు మున్సిపాలిటీ పరిధిలోని రోజువారీ కూలీలు, చిరుద్యోగులు, యువత ఈ నాటుసారా ఉచ్చులో పడి సర్వస్వం కోల్పోతున్నారు. నాసిరకం బెల్లం, రసాయనాలు, యూరియా కలిపి తయారు చేసే ఈ సారా తాగడం వల్ల ఆకలి మందగించి, ఆహారం తీసుకోలేక తీవ్రమైన కాలేయ, జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రుల పాలవుతుండటంతో ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**ఆబ్కారీ శాఖ కళ్లు మూసిందా..? మామూళ్ల మత్తులో జోగుతోందా..?**

పట్టణ నడిబొడ్డున ఇంత బహిరంగంగా సారా వ్యాపారం సాగుతున్నా.. సంబంధిత ఎక్సైజ్ (ఆబ్కారీ) శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ కేంద్రంలో ఏమి జరుగుతుందో అధికారులకు సమాచారం లేదా..? లేక వ్యాపారుల నుంచి అందుతున్న నెలవారీ 'మామూళ్ల' మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజలు సారా మత్తులో జోగుతుంటే, అధికారులు అక్రమార్కుల మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారని స్థానిక మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు చండూరు మున్సిపాలిటీలో తనిఖీలు ముమ్మరం చేసి, జొన్న రొట్టెల తెరవెనుక సాగుతున్న ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని మున్సిపల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయడం

## ప్రజా స్వామ్యంలో ఒక మంచి పరిణామం

గులాబీ జెండా ఎగురుతుందని తెలిపారు. రైతుల పొలాలు ఎండుతుంటే స్థానిక మంత్రి నీటి విషయంలో విఫలం అయ్యారని, తెలంగాణకి న్యాయ బద్ధంగా రావాల్సిన శ్రీశైలం నీటి వాటాను రాబట్టడంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారు అని నిండు అసెంబ్లీ లో అబద్దాలతో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ భూములపై సర్వే అంటూ డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టారని, సీఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ చేస్తున్న ఆగడాలు,అడ్డగోల సెటిల్మెంట్స్ ల్యాండ్ సెటిమెంట్లు,బయటకు తెలుస్తాయని భయంతో మాజీ సీఎం కేసీఆర్ పై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజల్లో ఇంకా కాంగ్రెస్ పార్టీ పలుచనైందని ఆరోపించారు. ఈ సమావేశంలోబిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు అరిబండి సురేష్ బాబు,డిసిసిబి మాజీ డైరెక్టర్,3వ వార్డు కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి,హుజూర్ నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ చందమల్ల జయబాబు,మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు,మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్లబోయిన లింగయ్య యాదవ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంజమూరి యశోద రాములు,మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లంకెపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## జాజిరెడ్డిగూడెం జడ్.పి.హెచ్.ఎస్ లో నో బ్యాగ్ డే

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 19 ( జనంసాక్షి )

జాజిరెడ్డిగూడెం పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, బుక్ రీడింగ్ పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం నాయిని మంజుల, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో జర్నలిస్టులకుహెల్త్ క్యాంప్

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి )

ఈ నెల 21న సోమవారం ఉదయం 10 గంటలకు టియూడబ్ల్యూజె (ఐజెయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు టియూడబ్ల్యూజె (ఐజెయూ) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నామా పురుషోత్తం, శీలం శ్రీనివాస్, కోశాధికారి పిన్ని సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద క్లినిక్ సెంటర్ లో యశోద హాస్పిటల్ వైద్యులచే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి గౌస్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఖాదర్ బాబా, టియూడబ్ల్యూజె (ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇంకా యూనియన్ రాష్ట్ర, జిల్లా, నగర బాధ్యులు, నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ. శిబిరం లో గుండె పరీక్షలతో పాటు ఇతర జనరల్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 21న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని జర్నలిస్ట్ మిత్రులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి వినియోగించుకోగలరని కోరారు.

## గ్రీన్ భద్రాద్రి సేవలు ఆదర్శనీయం

### ఏడీఆర్‌డీఓ శ్రీనివాస్

భద్రాచలం సెప్టెంబర్ 19 (జనంసాక్షి)

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా 15 ఏళ్లుగా గ్రీన్ భద్రాద్రి సంస్థ నిస్వార్థంగా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని వరంగల్ అడిషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఏడీఆర్‌డీఓ) శ్రీనివాస్ అన్నారు. గ్రీన్ భద్రాద్రి సేవలను ఆదర్శంగా తీసుకుని మహిళా సమాఖ్యల ద్వారా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో కొనసాగుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను పరిశీలించేందుకు శనివారం మహిళా సమాఖ్య గ్రూప్ లీడర్లతో కలిసి 30 మంది సభ్యుల బృందం భద్రాచలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలను బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రీన్ భద్రాద్రి 15 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం చేస్తున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించడం ఆనందంగా ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రీన్ భద్రాద్రి సేవలను స్ఫూర్తిగా తీసుకుని తమ మహిళా సమాఖ్య గ్రూపుల ఆధ్వర్యంలోనూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపడతామని శ్రీనివాస్ తెలిపారు. ప్రతి గ్రామంలో మొక్కల సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, ఇంకుడు గుంతల ఏర్పాటుపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి ట్రస్ట్ అధ్యక్షులు యేగి సూర్యనారాయణ, ఫాస్ట్ ప్రెసిడెంట్ కామిశెట్టి కృష్ణార్జునరావు, శ్రీరంగం సంపత్, డీఆర్‌డీఏ ఏపీవోలు అనిల్ కుమార్, బి.శ్రీనివాస్, సుధాకర్, మేనేజర్ ధనలక్ష్మి, మాలిని, స్రవంతి, రంజిత, స్వప్న, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలోకి గణనాథులు

**- భద్రాచలంలో ఘనంగా ప్రారంభమైన గణేశ్ నిమజ్జనాలు..- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న విగ్రహాలు.. - గోదావరి తీరంలో భక్తి సందడి..**

భద్రాచలం సెప్టెంబర్ 19 (జనంసాక్షి)

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం గోదావరి తీరం గణనాథుల నిమజ్జనాలతో భక్తి సందడిని సంతరించుకుంది. వినాయక చవితి వేడుకల అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గణేశ్ విగ్రహాలు భారీగా భద్రాచలం తరలివస్తున్నాయి. శనివారం నాటికి సుమారు 50 వరకు విగ్రహాలు భద్రాచలం చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

**- ప్రత్యేక వాహనాల్లో గణనాథులను తీసుకొస్తున్న భక్తులు..**

డప్పులు, మేళతాళాలు, జయజయధ్వానాల మధ్య గోదావరి ఘాట్‌కు చేరుకుని నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గణనాథుడిని గంగమ్మ ఒడిలోకి సాగనంపుతూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. విగ్రహాల రాకతో భద్రాచలం పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

**- భక్తుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు..**

నిమజ్జనాల నేపథ్యంలో గోదావరి ఘాట్ వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భద్రతతో పాటు విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నారు. గోదావరిలో నీటి ప్రవాహం, లోతును దృష్టిలో ఉంచుకుని నిమజ్జనం సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గణనాథులు తరలివస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిమజ్జన వేడుకలను తిలకించేందుకు స్థానికులతో పాటు పరిసర జిల్లాల నుంచి కూడా ప్రజలు భద్రాచలానికి తరలివస్తున్నారు. గణనాథుల నిమజ్జనాలతో గోదావరి తీరం భక్తి పారవశ్యంతో కళకళలాడుతోంది.



## చెస్‌లో ప్రథమ స్థానం.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

### విద్యార్థి సాంబయ్యను అభినందించిన ఉపాధ్యాయులు

కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన అచీూఔ (వికలాంగ విద్యార్థుల) క్రీడా పోటీల్లో కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నంద్యాల సాంబయ్య చెస్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వరాధవరావు, పీడీ డాక్టర్ రాము, ఉపాధ్యాయులు శనివారం విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన షూలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు.



# జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో మెరుగైన సేవలు




○బాధిత కుటుంబీకుల్లో ఆనందం

○వైద్య సేవలతో పాటు అవగాహన కార్యక్రమాలు

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ - 19( జనంసాక్షి,)**
ఖమ్మం జిల్లా సర్వ జన ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్యంతో పాటు మానసిక వైద్య విభాగం బాధితులకు విశిష్ట వైద్య సేవలు అందిస్తూ వారికి నూతన జీవితాన్ని అందిస్తోంది. సాధారణ మానసిక సమస్యల మొదలుకొని, వ్యసన విముక్తి, చట్టపరమైన సంరక్షణ దాకా ఎన్నో విభాగాలలో ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు ఉచితంగా సేవలు అందిస్తుంది. సాధారణ మానసిక వైద్య సేవల విభాగంలో సాధారణ మానసిక వైద్య చికిత్సలతో పాటు మాతా-శిశు మానసిక ఆరోగ్యం, బాల్యము నుండి వృద్ధాప్యం వరకు వచ్చే వివిధ రకాల మానసిక సమస్యలకు వ్యాధి నిర్ధారణ, సంపూర్ణ చికిత్స సేవలు అందుతున్నాయి. ఇక్కడ నెలకు సుమారు 300 వరకు కేసు నమోదవుతుండగా, ఒక్కో కేసుకు వ్యాధి తీవ్రతను బట్టి 3 నుండి 5 సంవత్సరాల కాలపరిమితితో చికిత్స అందిస్తున్నారు. వ్యసన విముక్తి సేవల్లో భాగంగా మద్యం , పొగాకు/సిగరెట్ , గంజాయి, చరష్, ఓపియాయిడ్ వంటి మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి ఇక్కడ పునరావాస సేవలు అందుతున్నాయి. వ్యసన విముక్తికి బాధితులకు కౌన్సిల్లింగ్, అవసరమైన వైద్య సేవలు అందించి, వారికి తిరిగి యధాస్థితి జీవితాన్ని ప్రసాదించడానికి అన్ని విధాల చేయుత అందిస్తున్నారు. దీనితో బాధితుని కుటుంబీకులు ఎంతో ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారు. సాధారణ డి-ఎడిక్షన్ తో ప్రతి నెలా దాదాపు 60 కేసులలో వ్యసన ప్రభావం నుండి స్వేచ్ఛను, పునరావాసాన్ని కల్పిస్తున్నారు. కేసులో బాధితుని స్థితిని బట్టి సమయానుసారంగా తగుచర్యలు చేపట్టడం జరుగుతుంది. మాదక ద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి 8 వారాల పాటు ప్రతి వారం కౌన్సెలింగ్, మార్గదర్శకత్వం ఇస్తారు. ఆ తర్వాత 'ర?యాపిడ్ డ్రగ్ ప్యానెల్ టెస్టింగ్' చేసి, ఫలితం నెగెటివ్ అని వస్తే న్యాయస్థానానికి నివేదిక ఇచ్చి కేసు కొట్టేసేలా విజ్ఞప్తి చేస్తారు. వైద్య-న్యాయ సంబంధిత సేవలు ఈ విభాగంలో నెలకు 20 కేసులు నమోదు కాగా, నెలకు సగటున 5 గురు వ్యసనం నుండి పూర్తిగా బయటపడి మార్పు చెందుతున్నారు. ప్రతి గురువారం ఆసుపత్రిలోని ప్రత్యేక గదిలో ట్రాన్స్ జెండర్ల కోసం ఓ.పి నిర్వహిస్తున్నారు. వివక్ష లేకుండా రహస్యంగా నిపుణులైన వైద్యులతో చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నారు. ప్రత్యేక సేవలు ఙ క్లినిక్లు ట్రాన్స్ జెండర్ క్లినిక్ కు నెలకు సగటున 5 కేసులు వస్తున్నాయి. మానసిక వైద్య విభాగం ద్వారా పోక్సో బాధితులకు సేవలు అందించడం జరుగుతుంది.18 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న బాలబాలికలకు లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించే చట్టం కింద మానసిక స్థితి విశ్లేషణ, కౌన్సెలింగ్, వైద్యం, న్యాయస్థానానికి నివేదికలు సమర్పిస్తున్నారు. నెలకు సుమారు 10 కేసులు వస్తుండగా సర్వ జన ఆసుపత్రి తగు చర్యలు తీసుకుంటున్నది. ఖైదీలకు మానసిక చికిత్సలో భాగంగా జైలు నుండి డిమాండ్ ఆధారంగా తీసుకొచ్చే ఖైదీలకు మందులు, కౌన్సెలింగ్ ద్వారా చికిత్స అందిస్తారు. నేషనల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ క్రింద సామాజికంగా బలహీనంగా ఉన్న వారిని గుర్తించి వారికి ఉచిత న్యాయ సహాయం అందేలా చూస్తున్నారు. నెలకు సుమారు 10 మంది ఖైదీలు సమస్యలతో సర్వ జన ఆసుపత్రికి వస్తుండగా, వారికి సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది. మెడికల్ బోర్డు సేవల క్రింద నెలకు ఇద్దరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగుల మానసిక స్థితిని పరీక్షించి పెన్షన్, వారసత్వ హక్కుల కోసమై 'పనిచేయడానికి అనర్హులు' అని ధృవీకరణ పత్రాలు ఇస్తారు. నెలకు 80-100 మందికి మానసిక వైకల్య శాతాన్ని నిర్ధారించి 'దివ్యాంగుల సర్టిఫికేట్లు' ఇస్తున్నారు. ఈ సంవత్సరం జనవరి - ఆగస్టు 26 వరకు సర్వ జనాసుపత్రిలో పోక్సో కేసులు (52), డి-ఎడిక్షన్ (452), సాధారణ ఓ.పి (1809), ఇన్-పేషెంట్ (67), ట్రాన్స్ జెండర్ (09), ఖైదీలు (51), ఫొరెన్సిక్ డి-ఎడిక్షన్ (55) కేసులకు చికిత్సలు అందించాం. విద్యా సేవలు ఙ విద్యార్థులకు శిక్షణకు సర్వ జన ఆసుపత్రి ద్వారా చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ ఎంబిబిఎస్ 3వ సంవత్సరం విద్యార్థులకు, ఇంటర్న్షిప్ చేసే కొత్త వైద్యులకు క్లినికల్ స్కిల్స్, మానసిక సమస్యలను గుర్తించే విధానంపై తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేగాక 'డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్' ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్ సైకియాట్రీ విద్యార్థులకు పూర్తి శిక్షణ ఇస్తున్నారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం', 'ఆత్మహత్యల నివారణ దినోత్సవం' వంటి సుమారు 20 సందర్భాలలో ప్రజలలో, విద్యార్థులలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రస్తుతం ఈ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక సీనియర్ రెసిడెంట్, ఒక ఆఖీఖ-ఖఉ వైద్యుడు, నర్సింగ్ సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. తగినంత మంది నిపుణులు లేకపోవడంతో సేవలకు కొంత ఆటంకం కలుగుతోందని, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఇతర సైకియాట్రిక్ వైద్యులను ఇక్కడకు డెప్యుటేషన్పై నియమిస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని, ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తున్నారు. రాబోయే కాలంలో సర్వ జన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగాన్ని మరింత పటిష్టం చేసి, బాధితులకు సత్వర చికిత్సలు అందేలా అన్ని చర్యలు చేపడుతున్నారు.

# పేదల వైపు వుండేది ఎర్ర జెండాలు మాత్రమే - నున్నా, వై. విక్రమ్

**ఖమ్మం కార్పొరేషన్ సెప్టెంబర్ 19( జనంసాక్షి)**
సిపిఎం పార్టీ హైకోర్ట్ లో వేసిన పిటిషన్ నేపథ్యంలో శ్రీనివాస్ నగర్ బాధితులకు ఊరట రావడంతో సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి గుడి వద్ద సభ నిర్వహించారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం ఎలా చేయాలి అనే దానిపై ప్రజల అభిప్రాయాలను నాయకులు తీసుకున్నారు. ఈ సభలో సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వరుసగా శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్యపై ఒకవైపు ప్రత్యక్ష ఆందోళన చేస్తూనే మరోవైపు పార్టీ హైకోర్ట్ తలుపు తట్టడం ఫలితంగా తాత్కాలిక ఊరట లభించింది అని తెలిపారు. అయితే భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ స్థలాల సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే విధంగా పార్టీ ఆందోళనలు చేయడంతో పాటు కోర్టు లో కూడా సీనియర్ లాయర్ లతో ప్రజల వైపు వాదనలను బలంగా వినిపిస్తాము అని



హామీ ఇచ్చారు. గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల కుటుంబాలు ఇక్కడే నివాసం శాశ్వతంగా వుండే విధంగా తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. శ్రీనివాస్ నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వివిధ రాజకీయ పార్టీలు కేవలం కంటితుడుపు ఆందోళనలు చేస్తున్నాయి అని, కేవలం లెఫ్ట్ పార్టీలు మాత్రమే బాధితుల వైపు వుండి పోరాటాలు చేస్తున్నాయి అని తెలిపారు. నిజాయితీ గా పేదల సమస్యలపై పోరాటాలు చేసేది కేవలం ఎర్ర జెండాలు మాత్రమే అని స్పష్టం చేశారు. ఓట్లు అప్పుడు మాత్రమే మిగతా పార్టీలు కనిపిస్తాయి అని ఆరోపించారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరుకు పార్టీ అటు కోర్టు లోనూ, ఇటు ప్రజా క్షేత్రంలో నూ ప్రజల వైపు వుంటుంది అని తెలిపారు. జిల్లా కలెక్టర్, మంత్రి, కమిషనర్ జోక్యం చేసుకుని పేదల ఇళ్లు కాపాడే విధంగా వుండాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భుక్యా శ్రీనివాసురావు, బండారు రమేష్, సైదులు, యర్రా గోపి, నాగుల మీరా, ఇమామ్, యర్రా రంజిత్, లాయర్ టి లింగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక శోభతో అయ్యన్నపాలెం.. ఘనంగా వినాయక నిమజ్జనం

## ఘనంగా ముగిసిన వినాయక ఉత్సవాల ముగింపు వేడుకలు



**చంద్రుగొండ, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** చంద్రుగొండ మండల పరిధిలోని అయ్యన్నపాలెం గ్రామంలో వినాయక ఉత్సవాల ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి శనివారం ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోత్ భోజ్యా నాయక్, చంద్రుగొండ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్ లు మాట్లాడుతూ.. వినాయకుడి కృపతో ప్రజలందరూ పాడిపంటలతో వర్ధిల్లాలని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, ధనధాన్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ముగియడంతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులు వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, మండల నాయకులు సారేపల్లి శేఖర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బన్నె నాగరాజు, రామారావు, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా నాయకులు ఆలకుంట రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# రుతుస్రావంపై భయాలు వీడి.. పరిశుభ్రత పాటించాలి

## బేటీ బచావో?బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ కొణిజర్లలో మెన్స్టువల్ హైజీన్పై అవగాహన

ఖమ్మం , సెప్టెంబర్ 19 (జనంసాక్షి)
బేటీ బచావో?బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కొణిజర్లలో విద్యార్థినులకు మెన్స్టువల్ హైజీన్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్ఈడబ్ల్యూ?డీఎంసీ ఎస్ డి సమ్రీన్ మాట్లాడుతూ, రుతుస్రావం అనేది బాలికల జీవితంలో సహజమైన శారీరక ప్రక్రియ అని, దీనిపై ఎలాంటి భయం, సిగ్గు లేదా సంకోచం అవసరం లేదని తెలిపారు. ప్రతి బాలిక వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శానిటరీ న్యాప్కిన్లను సక్రమంగా ఉపయోగించి, సమయానికి మార్చి, పరిశుభ్రంగా పారవేయాలని సూచించారు. డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది ప్రమీల,వాసంతి పోషకాహారం, ఐరన్?ఫోలిక్ యాసిడ్ ఉన్న ఆహారం తీసుకోవడం, రక్తహీనతను నివారించడం, తగినంత నీరు తాగడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని గుడ్ టచ్?బ్యాడ్ టచ్ గురించి బొమ్మ సహాయంతో



అవగాహన కల్పించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శను గుర్తించడం, నచ్చని స్పర్శకు ధైర్యంగా "నో" చెప్పడం, వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం వంటి విషయాలను వివరించారు. ఈ



కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది పి ప్రమీల, ఆర్ వాసంతి,కె సతీష్ కేజీబీవీ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం భద్రాద్రి ప్లాంట్ నిర్మాణం

✧సబ్ క్రిటికల్ టెక్నాలజీ చారిత్రక తప్పిదం కాలుష్య కోరల్లో బూడిద తిప్పలు..
✧రోజు రోజుకు పెరుగుతున్న మరణాల సంఖ్య..
✧హానికరమైన వాయువుల వల్ల అనారోగ్యానికి గురవుతున్నా ప్రజలు






**మణుగూరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చిక్కుడు గుంట వద్ద గత ప్రభుత్వం నిర్మించిన. భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం నిత్యం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం పరిపాటిగా మారిపోయింది. పవర్ ప్లాంట్ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు అనేక రోగాలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ రంగంలో జరిగిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ పెద్ద చారిత్రక తప్పిదంగా మిగిలిపోయినట్లు నిపుణులు వెల్లడిస్తున్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బొగ్గు వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించేందుకు 13వ పంచవర్ష ప్రణాళిక నుండి దేశంలో థర్మల్ ప్లాంట్ కు సబ్ క్రిటికల్ టెక్నాలజీని నిషేధించింది. కేవలం సూపర్ క్రిటికల్ టెక్నాలజీని మాత్రమే నిర్మించాలని అనుమతి ఉంది. కానీ గత ప్రభుత్వము నిర్మాణ రంగంలో ఒప్పందాలను ఉల్లంఘించి, సూపర్ క్రిటికల్ బదులుగా సబ్ క్రిటికల్ నిర్మాణ పనులకు దొడ్డిదారిలో బీహెచ్ఈఎల్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. తద్వారా భద్రాద్రి పవర్ ప్లాంట్ చుట్టుపక్కల ప్రాంతాలు ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని నానా అవస్థలుపడుతున్నారు.

**సబ్ క్రిటికల్-సూపర్ క్రిటికల్ మధ్య వ్యత్యాసం.:**
సబ్ క్రిటికల్ వ్యవస్థలో నీటి యొక్క క్లిష్టమైన పరిమితి 22.1ఎంపీ ఏపీడనం, 374 డిగ్రీల సెంటీగ్రేట్స్ ఉష్ణోగ్రత కంటే తక్కువ స్థాయిలో పనిచేస్తుంది. ఇక్కడ బాయిలర్ సుమారు 15.5 ఎం పి ఏ (155కేజీ సీఎం 2) పీడనం వద్ద పనిచేస్తాయి. దీనివల్ల బొగ్గు వినియోగం పెరిగి పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుంది. దీంతో పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రణాళిక , పర్యావరణ పరిరక్షణకు పరంగా తీవ్ర విమర్శలకు వివాదాలకు నిలయమైంది.
సూపర్ క్రిటికల్.... ఇది నీటి క్లిష్టమైన పరిమితి కంటే ఎక్కువ పీడనం (22.1 ఎం పి ఏ లేదా 221 బార్ పైన) మరియు 550 సెంటీగ్రేట్స్-600 సెంటీగ్రేట్స్ ఉష్ణోగ్రత వరకు పనిచేస్తాయి. దీనివలన బొగ్గు వినియోగం తగ్గి పర్యావరణానికి ఇబ్బంది లేకుండా పనిచేస్తుంది. సబ్ క్రిటికల్ లో బాయిలర్ నీరు వేడెక్కినప్పుడు అవి మొదట బుడగలుగా మారి ఆపై ఆవిరిగా రూపాంతరం చెందుతుంది. ఆ నీటిని ఆవిరిని వేరు చేయడానికి బాయిలర్ లో స్ట్రీమ్ డ్రం అవసరం ఉంటుంది. సూపర్ క్రిటికల్ లో అధిక పీడనం కారణంగా నీరు నేరుగా ఎటువంటి బుడగలు లేకుండా ధూమ దశ మారకుండా ద్రవంగా మారి టర్బైన్స్ ను తిప్పుతుంది. దీనికి డ్రీడం డ్రం అవసరం ఉండదు. ఇటువంటి నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఎన్ జి టి ట్రిబ్యునల్ ఏడాది పాటు స్టే విధించడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. మరలా రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాల దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక మినహాయింపులు కేంద్ర పర్యావరణ శాఖ ప్రాజెక్టుకు అనుమతులను మంజూరు చేసింది.

**హానికరమైన వాయువులు:**
పవర్ ప్లాంట్ చిమ్నీ నుండి విడుదలయ్య సల్ఫర్ డయాక్సైడ్ నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్డయాక్సైడ్ ) వాయువులు వాతావరణ సమస్యలను దెబ్బతీస్తూ పర్యావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం అవుతుంది.

**జల కాలుష్యం వ్యవసాయంపై ప్రభావం:**
గోదావరి నది కాలుష్యం ప్లాంట్ నుండి బూడిదతో కూడిన రసాయనిక వ్యర్థాలు, వాగుల ద్వారా గోదావరి నదిలోనికి చేరడం పై పర్యావరణ మండలి గతంలో ఆంక్షలు కూడా విధించింది. భూగర్భ జలాలు కలుషితం బూడిద చెరువు నుండి రసాయనిక వ్యర్థాలు భూమిలోనికి ఇవ్వడం వలన చుట్టుపక్కల ప్రాంతాల పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

**గోదావరి ఒడ్డు ప్లాంటుకు వరద ముప్పు:**
భద్రాద్రి పవర్ ప్లాంట్ నీటి సరఫరా కోసం నిర్మించిన నాణ్యతలేని యంత్రాలు, పైపులు వాడడం వలన నదికి వరద వచ్చినప్పుడల్లా ప్లాంట్ ముంపుకి గురవుతుంది. ఇటువంటి సాంకేతిక అంశాలను పట్టించు కోకుండా కట్టారని దీనిపై అప్పట్లో విద్యుత్ అధికారి రఘు జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు ఉంచిన పనులు ఆగకుండా పూర్వవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**పెరుగుతున్న మరణాలు:**
బూడిదలో ఉండే రసాయనాలు భారీ లోహాలు క్యాన్సర్‌కు కారణమవుతాయి . దీర్ఘకాలం పాటు ఈ దుమ్మును పీల్చడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ. చర్మం, మూత్రపిండాలు కాలేయ క్యాన్సర్ల ప్రమాదం కూడా పెరుగుతుంది.సూక్ష్మ ధూళి కణాలు (పి ఎం 2.5) రక్తంలో కలిసి ధమనులలో వాపును కలిగిస్తాయి. దీనివల్ల గుండె జబ్బులు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.దీనితో పాటు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాంట్రాక్టర్ అధికారులు చేసిన తప్పు వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

## భద్రాచలంలో శతాధిక కవితా సందడి..

**- 200 మంది కవులతో 176వ శతాధిక కవి సమ్మేళనం**

**భద్రాచలం సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
భద్రాది కొత్తగూడెం జిల్లా :- తెలుగు భాషా వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పేలా ఎటపాక మండలం మేడువాయిలోని పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న 176వ శతాధిక కవి సమ్మేళనం జయప్రదం కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆకాంక్షించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కవి సమ్మేళనానికి దేశవ్యాప్తంగా సుమారు 200 మంది కవులు హాజరుకానుండటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శనివారం తన చాంబర్‌లో కవి సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలను బి. రాహుల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి సమ్మేళనాలు కేవలం సాహిత్య వేదికలే కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని, సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించే వేదికలని అన్నారు. భద్రాచలం కేంద్రంగా ఇంతటి భారీ స్థాయిలో కవి సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని, తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి, పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మి సాయిరాం, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ సురేష్‌బాబు తోటమల్ల, జిల్లా ప్రతినిధి ఎర్రంశెట్టి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

ధనిసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కు ఏర్పాట్లు
గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, సిపి

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు - 19( జనంసాక్షి)**
గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.
శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ× ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్ళు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ?నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.
ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు.
భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.
ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్ట్‌ల్లో పారిశుద్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు.
గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, .
అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కమిషనర్ గదిలో కౌన్సిలర్ ధర్నా

○నెల రోజులుగా పారిశుధ్యానికి నోచుకోని విద్యానగర్..
○దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్న ప్రజలు..






**భువనగిరి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**
భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు విద్యానగర్‌లో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. గత నెల రోజులుగా మున్సిపాలిటీ సిబ్బంది వార్డు వైపు కన్నెత్తి చూడకపోవడంతో వీధులన్నీ చెత్తాచెదారంతో నిండి పోయాయి. చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, వెంటనే మున్సిపాలిటీ సిబ్బందిని నియమించి పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ 33వ వార్డు ఃఖీా కౌన్సిలర్ నాకోటి నగేష్ వినూత్న నిరసనకు దిగారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో నేలపై కూర్చొని బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నగేష్ మాట్లాడుతూ, పదేపదే ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజారోగ్యం కంటే ముఖ్యమైంది ఏదీ లేదు. వెంటనే సిబ్బందిని నియమించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం" అని స్పష్టం చేశారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

○ డీజేలు, క్రాకర్స్‌కు అనుమతి లేదు.. ○ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.
○ భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలి., ○ డీఎస్పీ అరుణ్‌కుమార్..

**భద్రాచలం సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
భద్రాచలంలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం. అరుణ్‌కుమార్ శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జన సమయంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రక్షణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సూచించారు. ఎవరూ మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమానికి రావద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, క్రాకర్స్ వినియోగానికి పూర్తిగా అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన ప్రాంతంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా



ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల భద్రత, నది పరిసరాల్లో రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ ఆదేశించారు. నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో డీడీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ రక్షణ బృందాలను కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని డీఎస్పీ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.



## కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా..

**- అంచెలంచెలుగా ఎదిగిన రెంటపల్లి స్వామి.**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా ప్రస్థానం ప్రారంభించిన రెంటపల్లి స్వామి అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా నియమితులయ్యారు. విధినిర్వహణలో చూపిన సేవలకు గుర్తింపుగా లభించిన ఈ పదోన్నతితో ఆయన పోలీసుశాఖలో మరో మెట్టు అధిరోహించారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా స్వామి నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా



బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మేడ ప్రసాద్, నాగభిక్షం, రామ్మూర్తితో పాటు స్టేషన్ సిబ్బంది స్వామిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# యూపీఎస్సీ సివిల్స్-2027కు ఉచిత కోచింగ్

**- ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక**
**- 100 సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు.. ఎస్టీలకు మరో 20 డైరెక్ట్ ఎంట్రీ సీట్లు**
**- ఐటీడీఏ పీవో బి.రాహుల్**



భద్రాచలం సెప్టెంబర్ 19 (జనంసాక్షి)
యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష-2027లో ప్రతిభ కనబరిచేలా తెలంగాణకు చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. శ్రీరామ్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించే 'ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ స్కీమ్'లో భాగంగా అభ్యర్థులను స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లో ఉన్న 'ఐఏఎస్' స్టడీ సర్కిల్ ఫర్ ఎస్ లలో సుమారు 8 నెలలపాటు లేదా యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష తేదీ వరకు, ఏది ముందైతే అంతవరకు ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్, మార్గదర్శకత్వం అందిస్తారు.

**దరఖాస్తులకు సెప్టెంబర్ 23 చివరి తేదీ**
అర్హులైన అభ్యర్థులు వెల్ఫేర్. శ్రీరామ్ సియాస్. కం (ఇంగ్లీష్) లో వెబ్‌సైట్ ద్వారా సెప్టెంబర్ 23 సాయంత్రం 6 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబర్ 25 మధ్యాహ్నం 2 గంటల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెప్టెంబర్ 27న యూపీఎస్సీ ప్రిలిమ్స్ ప్రమాణాల ప్రకారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అక్టోబర్ 1న ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ, అక్టోబర్ 2న తుది ఫలితాల ప్రకటన, అక్టోబర్ 5 నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని పీవో తెలిపారు.

**- అర్హతలు ఇవే..**
2026 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి కనీసం 21 సంవత్సరాలు పూర్తి చేసి ఉండాలి. గరిష్ట వయోపరిమితి 32 సంవత్సరాలు. దివ్యాంగ అభ్యర్థులకు 35 సంవత్సరాల వరకు అవకాశం ఉంటుంది. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ లేదా సమానమైన అర్హత ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదు. స్క్రీనింగ్ పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్-1, సీఎస్ఏటీ ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 1/3 నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. సీఎస్ఏటీలో అర్హత సాధించిన అభ్యర్థుల జీఎస్ పేపర్-1 మార్కుల ఆధారంగా మెరిట్ రూపొందిస్తారు. అనంతరం ఇంటర్వ్యూ ద్వారా తుది ఎంపిక జరుగుతుంది.
120 సీట్లు.. మహిళలకు 33? శాతం రిజర్వేషన్
స్క్రీనింగ్ పరీక్ష ద్వారా మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో ఎస్టీలకు 75, ఎస్సీలకు 15, బీసీలకు 10 సీట్లు ఉన్నాయి. గత ఐదేళ్లలో కనీసం ఒకసారి యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన ఎస్టీ అభ్యర్థులకు డైరెక్ట్ ఎంట్రీ కింద మరో 20 సీట్లు కేటాయించారు. దీంతో మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉంటాయి. మొత్తం సీట్లలో మహిళలకు 33? శాతం, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం 3 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

**- డైరెక్ట్ ఎంట్రీకి ప్రత్యేక అర్హతలు.**
గత ఐదేళ్లలో కనీసం ఒక యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులై ఉండి, ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థులు డైరెక్ట్ ఎంట్రీకి అర్హులు. 2026 ఆగస్టు 1 నాటికి 35 సంవత్సరాలు మించకూడదు. అర్హులైన వారు అవసరమైన ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని శ్రీరామ్స్ ఐఏఎస్ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు లేదా హైదరాబాద్ఏశ్రీరామ్ సియాస్. కం (ఇంగ్లీష్) లో ఇ-మెయిల్ ద్వారా పంపవచ్చు.

**- ఉచిత కోచింగ్‌తో పాటు పలు సౌకర్యాలు.**
ఎంపికైన వారికి జిఎస్, సి ఎస్ ఎ టి, ఆప్షనల్ సబ్జెక్టులకు యూపీఎస్సీ కోచింగ్, ఉచిత స్టడీ మెటీరియల్, టెస్ట్ సిరీస్, నెలవారీ కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్, ప్రత్యేక మెంటర్ల మార్గదర్శకత్వం అందిస్తారు. మెయిన్స్, ఇంటర్వ్యూలకు కూడా సహాయం అందించనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. నిబంధనలకు అనుగుణంగా తరగతులు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బాలురకు నెలకు రూ.1,000, బాలికలకు రూ.1,250 పాకెట్ మనీ, నోట్‌బుక్స్, నిర్ణీత పరిమితిలో జిరాక్స్ సౌకర్యం, రోజువారీ తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికలు, లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉంటాయి. యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు ఒక్కో అభ్యర్థికి రూ.300 రవాణా భత్యం కూడా చెల్లిస్తారు.
స్క్రీనింగ్ పరీక్షలో ఏముంటుంది? జీఎస్ పేపర్-1లో కరెంట్ అఫైర్స్, భారత చరిత్ర?జాతీయోద్యమం, జనరల్ సైన్స్, భూగోళశాస్త్రం, పాలిటీ, ఆర్థికశాస్త్రం అంశాలపై 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు, గరిష్ట మార్కులు 200.

**- సీఎస్ఏటీలో అవగాహన, భాషా.**
నైపుణ్యాలు, తార్కిక విశ్లేషణ, నిర్ణయాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కారం, సాధారణ మానసిక సామర్థ్యంపై 80 ప్రశ్నలు ఉంటాయి. దీనికి 120 నిమిషాల సమయం ఉంటుంది. సీఎస్ఏటీలో అర్హత మార్కులు 66.7గా నిర్ణయించారు. ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్‌కు 20 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, కమ్యూనిటీ?నేటివిటీ?పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, తాజా కుటుంబ ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

## సమాజాన్ని మేల్కొలిపే రచయిత శ్రీనివాసరావు
# ఘనంగా సత్కరించిన - టిడబ్ల్యూజేఎఫ్..




**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 19( జనంసాక్షి)** సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత మంత్రి ప్రగడ శ్రీనివాసరావు రచనలు సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఆలోచనను రేకెత్తిస్తున్నాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్ అన్నారు. శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ, ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్ సభకు అధ్యక్షత వహించారు.సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ తెలుగు భాషపై మక్కువ, సామాజిక అంశాలపై అవగాహన, నిరంతర కృషి శ్రీనివాసరావు రచనలకు ప్రత్యేకతను తీసుకొచ్చాయని అన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కథనాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయని గుర్తుచేశారు. అమెరికాలోనూ తెలుగు భాష, సంస్కృతి విశిష్టతను చాటిన శ్రీనివాసరావు ఖమ్మం జిల్లాకు చెందినవారు కావడం గర్వకారణమన్నారు. జర్నలిస్టుల హక్కులు, ఇళ్ల స్థలాల సమస్యలపై ఆయన అనుభవం, రచనా ప్రతిభ ఫెడరేషన్‌కు ఎంతో ఉపయోగపడాలని ఆకాంక్షించారు.టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ శ్రీనివాసరావు రచనలు, కవితలు యువ జర్నలిస్టులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయని అన్నారు. సభ్యుడు షేక్ జానీ పాషా, మధుశ్రీ, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి మాధవరావు, కొరకొప్పుల రాంబాబు తదితరులు ఆయన సేవలను కొనియాడారు. ఆయన సాహిత్య, జర్నలిస్టు సేవలను గుర్తించి తగిన గౌరవ పురస్కారానికి సిఫార్సు చేసే అంశాన్ని పరిశీలించాలని సంతోష్ చక్రవర్తి సూచించారు.సత్కారానికి స్పందించిన మంత్రి ప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికాలో అవార్డు పొందడం కంటే ఆత్మీయ జర్నలిస్టుల మధ్య ఫెడరేషన్, ప్రెస్ క్లబ్ వేదికగా సత్కారం పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సయ్యద్ ఖదీర్ నాయకత్వాన్ని, దువ్వా సాగర్, జానీ పాషా అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కులు, ఇళ్ల స్థలాల సమస్యలతో పాటు జర్నలిస్టు సంక్షేమ అంశాలపై తన రచనా శక్తిని వినియోగిస్తానని తెలిపారు. హక్కుల సాధన కోసం అన్ని జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాసరావును శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు యూసుఫ్ పాషా, జర్నలిస్టులు ఎస్వీ రెడ్డి, రోషి రెడ్డి, మురళి, వీడియో జర్నలిస్టు అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు..



## బిసి గురుకుల పాఠశాలల్లో
# సీజన్ వ్యాధుల పై అవగాహన

**నేరేడుచర్ల సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :**
మహాత్మ జ్యోతిరావు పూలే బి.సి. బాలుర గురుకుల హాస్టల్, రామాపురం నందు సీజనల్ వ్యాధులపై ఽ మానసిక వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పున్నా నాగిని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి ఎలా నివారించుకోవాలో తెలియజేస్తూ, ఎవరికైనా ఇబ్బంది ఉంటే టేలి మానస్ టోల్ ఫ్రీ నెంబర్ "14416" ను సంప్రదించి సలహాలు సూచనలు పొందాలని కోరారు.సీజనల్ వ్యాధుల పైన (మలేరియా, డెంగ్యూ, బోదకాలు, చికెన్ గున్యా, మెదడువాపు ) పై అవగాహన కల్పించారు.దోమలు పుట్టకుండా,నీరు నిల్వ ఉంచే వాటిని వారానికి ఒకసారి తొలగించాలని శుభ్రం చేసుకోవాలని,దోమలు కుట్టకుండా మెస్ జాలీలు కిటికీలకు ఏర్పాటు చేసుకోవాలని, సాయంత్రం వేళలో తలుపులు మూసి ఉంచాలని, దోమలు కుట్టకుండా మస్కిటో కాయిల్స్, దోమతెరలు వాడాలని తెలిపారు.పరిశుభ్రతతో పాటు,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. హ్యాండ్ వాష్ టెక్నికులు పిల్లలందరికీ అర్థమయ్యేటట్లు చూపించారు. పౌష్టికాహారం తీసుకోవాలని,ఫిజికల్ ఎక్సర్ సై జులు చేసి మానసికంగా దృఢంగా ఉండాలని, యోగ ధ్యానం లాంటివి చేసుకొని, మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలని తెలియజేశారు.చిరు వ్యాధులు (జలుబు, దగ్గు, తలనొప్పి,ఎల్లర్జీ ) ఉన్న 25 మంది విద్యార్థులకు చికిత్స అందించారు.ఈ కార్యక్రమంలో,హెల్త్ అసిస్టెంట్ జి.ఎం.నరసయ్య, ఆశా కార్యకర్త విజయరాణి ,ప్రిన్సిపల్ శ్రీనివాస్,హెల్త్ సూపర్వైజర్ కవిత, ఽ ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులు ఆందోళన చెందవద్దు
### ఖాళీ గన్నీ సంచులకు ఒక్కింటికి రూ.21.80 చొప్పున చెల్లింపు



**ఖమ్మం , సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**
ఖమ్మం జిల్లా ముదిగొండ మార్క్‌ఫెడ్‌కు మొక్కజొన్నలు విక్రయించిన రైతులకు ఖాళీ గన్నీ సంచుల చెల్లింపులు సోమవారం నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి తెలిపారు. ఖాళీ గన్నీ సంచుల డబ్బులు రావని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ముదిగొండ మండలంలోని మొక్కజొన్న రైతులకు సంబంధించిన ఖాళీ గన్నీ సంచుల చెల్లింపుల విషయాన్ని మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారావు దృష్టికి తీసుకెళ్లినట్లు యలగొండస్వామి తెలిపారు. న్నారు. మార్క్‌ఫెడ్‌కు మొక్కజొన్నలు విక్రయించిన ప్రతి రైతుకు, వారు ఉపయోగించిన గన్నీ సంచుల సంఖ్య ఆధారంగా ఒక్కో ఖాళీ గన్నీ సంచికి రూ.21.80 చొప్పున ప్రభుత్వం చెల్లించనున్నట్లు యలగొండస్వామి వెల్లడించారు

## గుమ్మడవల్లి గ్రామంలో ఘనంగా రేఖా రెడ్డి జన్మ దిన వేడుకలు

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో శనివారం మాజీ ఎంపిపి దూదిపాల రేఖా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మ దిన వేడుకలకు దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం రేఖా రెడ్డి సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు. తమ జన్మదిన రోజున గ్రామానికి వచ్చిన మాజీ ఎంపిపిని ప్రజలు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆమె జన్మదిన సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ అదిరాల రమేష్ సుమలత, ఉప సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, గ్రామ వార్డు సభ్యులు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆదిరాల రమేష్, యువజన సంఘం నాయకులు ఫయాజ్, శంకర్, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.






# విద్యకు కాషాయికరణ ప్రమాదం
### -పేదలను విద్యకు దూరం చేస్తున్న పాలకుల విధానాలు
### -విద్యార్థి ఉద్యమాల సారధి ఏఐఎస్ఎఫ్
### -ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్

**ఖమ్మం సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :**
భారతదేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ -తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో -మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు -శనివారం స్థానిక ఐఎంఏ హాల్ లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూ నగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్ నగర్ (ఐఎంఏ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. 28వ -మహాసభకు గుర్తుగా 28 మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను ధరించి ముందు నడిచారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో -విద్యార్థులు పాల్గొన్నారు. మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా -లక్ష్మణ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమేపి విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చిందని శాస్త్ర సాంకేతిక -పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో చాందస వాదాన్ని పసిమెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. -విద్యా రంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలు, నిరుద్యోగం తదితర సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూ విద్యార్థి ఉద్యమ సారధిగా నిలిచిందన్నారు. అనేక మంది యోధులు ఏఐఎస్ఎఫ్ పనిచేశారని వారందరి స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ -బహుముఖ పోరాటాల ద్వారా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని పోరాటాలు -మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య "అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా -సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో ఘనంగా 70వ మండల పాఠశాల క్రీడలు
- **క్రీడలను ప్రారంభించిన ఎస్‌హెచ్ఓ విజయసింహారెడ్డి, ఎంఈఓ ఆనంద్‌కుమార్**
- **వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో విద్యార్థుల ప్రతిభకు పరీక్ష**

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 70వ మండల పాఠశాల క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను అన్నపురెడ్డిపల్లి ఎస్‌హెచ్ఓ విజయసింహారెడ్డి, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. 14, 17 సంవత్సరాల లోపు విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడల్లో పోటీలను నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ విజయసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పాఠశాల స్థాయి నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.

**వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం**
మండల విద్యాశాఖాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు తంబళ్ల బాలరాజు ఆధ్వర్యంలో మండల క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణారావు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.





కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మన కార్యాలయం మనందరి కార్యాలయంలో శనివారం మండల అభివృద్ధి ప్రధాత, మాజీ ఎంపిపి దూదిపాల రేఖా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి దూదిపాల రేఖా రెడ్డికి శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డ్రీమ్ హోమ్ డిసైనర్, సివిల్ ఇంజనీర్ షేక్ ఫయాజ్.

**జనంసాక్షి, కొండమల్లేపల్లి**

# ఇంటి ప్రహారీ గోడ ధ్వంసం..

## వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్19 (జనంసాక్షి):** ఇంటి ప్రహారీ గోడను గడ్డపారతో ధ్వంసం చేయడమే కాకుండా, ప్రశ్నించినందుకు బూతులు తిడుతూ బెదిరింపు లకు దిగిన ఓ వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు పాల్వంచ రూరల్ ఎస్సై కి శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం... పాల్వంచ మండలం సీతానగర్ కాలనీకి చెందిన పద్మ అనే మహిళ తమ గ్రామంలో గత జూలై 23వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో, ఆమె ఇంటి పక్కన దక్షిన వైపున పొలం ఉన్న కేశవపురం గ్రామానికి చెందిన గందం వెంకటరావు (తండ్రి: సోమయ్య) గడ్డపారతో వచ్చి ఆమె ఇంటి ప్రహారీ గోడను ధ్వంసం చేశాడు.దీనిని గమనించిన పద్మ, ఆమె కుమారుడు బండారి దుర్గ బాబు వెళ్లి "ఎందుకు మా గోడను కూల్చివేశావు?" అని ప్రశ్నించారు. దాంతో వెంకటరావు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బూతులు తిడుతూ "ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, ప్రహారీ గోడ నా పొలంలోకి వచ్చింది అందుకే కూల్చాను" అని బెదిరింపులకు దిగాడు. ఈ ఘటన వల్ల తమకు సుమారు 30,000 వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై కేశవపురం గ్రామానికి చెందిన పెద్దమనుషులు చింతకాయల శ్రీను, ఐదుప్పుల రవిలకు తెలపగా, వారు పంచాయితీ చేస్తామని చెప్పినప్పటికీ వెంకటరావు పంచాయితీకి రాలేదని, ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఇంటి ప్రహారీ గోడను ధ్వంసం చేసి, తమను బూతులు తిట్టి, బెదిరించిన గందం వెంకటరావుపై చట్టపరమైన తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రెడ్‌క్రాస్ ఎన్నికలకు తెర

ఏజెన్సీ ప్రజలకు మరింత సేవే లక్ష్యం తన సేవా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో తన ప్యానల్‌కు మద్దతు ఇవ్వాలని నాగేశ్వరరావు కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు, పేదలు, వెనుకబడిన వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### యూపీఐ లావాదేవీలపై ఛార్జీలను వెంటనే ఎత్తివేయాలి:

### సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్19 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం యూపీఐ లావాదేవీలపై విధించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఓఆఖీ) పన్నును తక్షణమే ఉపసంహరించు కోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు కల్లూరి కిషోర్ డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచలోని టీయూసీఐ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ పన్ను పోటు వల్ల అంతిమంగా సామాన్య ప్రజలపై రూ.30 వేల కోట్లకు పైగా అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ చెల్లింపులను ఉచితంగా కొనసాగించకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు, గోనెల రమేష్, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు.. ఆటో కార్మికుల బతుకులకు గండి!

ఏజెన్సీ గ్రామాలకు ఇప్పటికీ సరిపడా బస్సు సౌకర్యం లేదని కార్మికులు, ప్రజలు అంటున్నారు. ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం, పినపాక తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల అవసరానికి అనుగుణంగా అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు భద్రాచలం?మణుగూరు వయా అశ్వాపురం ప్రధాన రూట్‌లో తరచూ బస్సులు నడుస్తున్న నేపథ్యంలో అవసరానికి మించిన సర్వీసులను సమీక్షించి, బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు మళ్లించాలని కోరుతున్నారు. పావుగంటకో బస్సు నడిపే ప్రాంతాల్లో సర్వీసులను అవసరానికి అనుగుణంగా సర్దుబాటు చేసి, మారుమూల పల్లెలకు రవాణా సౌకర్యం పెంచితే ప్రజల ఇబ్బందులు కూడా తీరుతాయని పేర్కొంటున్నారు.

**ఆటో కార్మికులకు సంక్షేమ ప్యాకేజీ కావాలి:**

ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆదాయం కోల్పోతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని వారు కోరుతున్నారు. ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం, ఉచిత ప్రమాద బీమా, రోడ్‌టాక్స్ మినహాయింపు, ఆరోగ్య?విద్యా ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేక ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అవసరమున్న వారికి ఉచిత ప్రయాణం.. మిగతావారికి ప్రత్యామ్నాయం:**

ఉచిత బస్సు సౌకర్యం నిజంగా అవసరమున్న వృద్ధులు, వికలాంగులు, నిరుపేద విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పూర్తిస్థాయిలో అందించడంతో పాటు, ప్రయాణ ఖర్చు భరించగలిగే వారు సాధారణ చార్జీలతో ప్రయాణించే విధానాన్ని పరిశీలించాలని కొందరు ఆటో కార్మికులు సూచిస్తున్నారు.సంక్షేమ పథకాల ఉద్దేశం ప్రజలను శాశ్వతంగా ఉచితాలపై ఆధారపడేలా చేయడం కాకుండా, ఉపాధి అవకాశాలను పెంచి స్వయం ఆధారితంగా నిలబెట్టడమే కావాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు మహిళలకు రవాణా సౌకర్యం కొనసాగిస్తూ, మరోవైపు ఆటో కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం విధానాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి:**

ఆటో కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం.. ఆటో కార్మికులకు జీవన భరోసా.. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం?ఈ మూడు అంశాలను సమన్వయం చేసే విధానం తీసుకురావాలని కోరుతున్నారు.

## ఐటీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పూణెం సురేంద్ర

### - ఏకగ్రీవంగా ఎన్నిక.. అభినందనలు తెలిపిన కార్మికులు.

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం ఐటీసీ భద్రాచలం పేపర్‌బోర్డులోని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎన్ టి యు స ఏ/49 నూతన అధ్యక్షుడిగా ముసలిమడుగు సర్పంచ్ పూణెం సురేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆయనను అధ్యక్ష బాధ్యతలకు ఎన్నుకున్నారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణతో పాటు యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు పూణెం సురేంద్ర కృషి చేయాలని కార్మికులు ఆకాంక్షించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా సురేంద్రకు పలువురు కార్మికులు, నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పూణెం సురేంద్ర తెలిపారు.

## అందరి సహకారంతోనే సూర్యాపేట బంద్ విజయవంతం

### బంద్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట పట్టణంలో శుక్రవారం జరిగిన బంద్ కు పూర్తిగా సహకరించిన వర్తక, వ్యాపార, వాణిజ్య వర్గాలకు , హోటల్స్ యజమానులకు, మెకానిక్ లకు, లాయర్స్ కు, విద్యాసంస్థల యాజమాన్యాలకు, బందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జేఏసీ ధన్యవాదాలు తెలిపింది.శనివారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంకు ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనకై ఎండను కూడా లెక్క చేయకుండా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు బందులో పాల్గొన్నారని తెలిపారు.సూర్యాపేట ప్రజల ఐకమత్యాన్ని ఈ బంద్ ద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామని అన్నారు.బంద్ లో బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్ కూడా స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారని చెప్పారు. సూర్యాపేట బంద్ బుల్లెట్ ట్రైన్ సాధనలో ఒక కీలకమైన సంఘటన అని తెలిపారు.అఖిలపక్షాల పిలుపుకు మద్దతిచ్చి బందును విజయవంతం చేసిన అన్ని వర్గాల వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల పక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లు నాగార్జున రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, మందాడి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, చల్లమల్ల నరసింహ, సలిగంటి వీరేంద్ర, ఎల్గూరి రామ్మూర్తి,కర్నాటి కిషన్, పెద్దిరెడ్డి గణేష్, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరాంరెడ్డి,భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.



# రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి - సీఐటీయూ

**గరిడేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కె. యాకూబ్ డిమాండ్ చేశారు. గరిడేపల్లిలో శుక్రవారం ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో యాకూబ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా రవాణా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12,000 ఇస్తామని, మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన డ్రైవర్లను ఆదుకుంటామన్న హామీ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు.ఫైనాన్స్ కంపెనీల వేధింపులు తట్టుకోలేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి ఆదాయం తగ్గిపోయిందన్నారు. వెంటనే యాక్సిడెంట్ బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోయిన ఆటో కార్మికులకు నెలకు రూ.6,000 చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, పట్టణ, మండల కేంద్రాల్లో ప్రభుత్వమే ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రయ్య, ముస్తఫా, చారి, కాసులు, భద్రాచలం, రవి, హుస్సేన్, పోలిశెట్టి సైదులు, పాండు నాయక్, రామ్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# రాజపురంలో ఘనంగా మహా అన్నదానం

**○వినాయక మండపం వద్ద 600 మందికి అన్నప్రసాదం**

**○ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలి: ఎస్సై విజయసింహారెడ్డి**

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని రాజపురం గ్రామం పైరెడ్డి బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 600 మందికి అన్నప్రసాదాన్ని అందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి హాజరై అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడంతో పాటు నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంత వాతావరణంలో, అందరి సహకారంతో సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, కవిత రాణి, గణపతిరెడ్డి, మంగతాయారు, సమత, వెంకటరెడ్డి, నాగేశ్వరమ్మ, రామిరెడ్డి, జ్యోతి, శ్రీనివాసరెడ్డి, సత్యవేణి, కృష్ణారెడ్డి, శ్రీదేవి, ప్రసాద్‌రెడ్డి, సుహాసిని, సత్యనారాయణరెడ్డి, కుమారి, సత్యవాణి, నాగిరెడ్డి, కమల, సరోజిని, అరుణ, చెన్నారెడ్డి, బాపిరెడ్డి, సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి: ప్రెస్ క్లబ్ విజ్ఞప్తి



- ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి
- విలేకరికి సొంత గ్రామంలో స్థలం ఉంటే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి
- అర్హులైన విలేకరులందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలి
- మీడియాపై దాడులు చేస్తే సహించేది లేదు: ప్రెస్ క్లబ్ తీర్మానం

**తిరుమలాయపాలెం, సెప్టెంబరు 19 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి విలేకరుల కీలక సమావేశం జరిగింది. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు పసలాది సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పప్పుల శీను నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా పలు సంచలన తీర్మానాలు ఆమోదించారు. మండలంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న విలేకరుల హక్కులను కాపాడటంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విలేకరులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని పూర్తి ఉచిత వైద్యం అందించేలా ప్రభుత్వం హెల్త్ కార్డులు జారీ చేయాలని, దాంతో పాటు అర్హులైన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. సమాజంలో నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల పైన, మీడియా పైన ఎవరైనా భౌతిక దాడులకు పాల్పడినా లేదా బెదిరింపులకు దిగినా ఎంతమాత్రం సహించేది లేదని, అలాంటి శక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేలా ప్రెస్ క్లబ్ అండగా నిలుస్తుందని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడుతామని స్పష్టం చేశారు.



## కబడ్డీలో కె ఆర్ ఆర్ డిగ్రీ మొదటి స్థానం

**కోదాడ, (జనంసాక్షి):** కోదాడ పట్టణంలోని కేఆర్ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థుల కబడ్డీ జట్టు ఈనెల 17,18న మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన డిగ్రీ స్థాయి పురుషుల కబడ్డీ క్రీడలో పాల్గొని మొదటి స్థానం సాధించింది. కబడ్డీ విజేత లయిన విద్యార్థులకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ హదస రాణి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చందా అప్పారావు, పిడి ఫ్రాన్సిస్ తో పాటు అధ్యాపక బృందం అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హదసరాణి మేడం మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మొత్తం 18 జట్లు పాల్గొనగా కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం గర్వం గా ఉందన్నారు. కళాశాల పిడి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ యూని వర్సిటీ స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థుల్లో 5 గురు విద్యార్థులు డిసెంబర్ 28 నుండి 2027 సంవత్సరం జనవరి 1 వరకు కర్ణాటక రాష్ట్రం మంగుళూరు లోని ఏనే పోవ డీమ్?డ యూనివర్సిటీలో వివిధ యూనివర్సిటీల స్థాయి లో నిర్వహించే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో మహాత్మా గాంధీ యూనివర్సిటీ జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. యూనివర్సిటీ జట్టులో పాల్గొనే విద్యార్థులు బిఎ ఫైనల్ ఇయర్ అజిత్, బిఎ సెకండ్ ఇయర్ నరేందర్, బీఎస్సీ సెకండ్ ఇయర్ కి చెందిన గురుమూర్తి బిఎ ఫస్ట్ ఇయర్ కు చెందిన విద్యార్థి సాయి లు మన యూనివర్సిటీ జట్టు తరపున ఆడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నిర్మల కుమారి, ఇతర అధ్యాపకులు కబడ్డీ జట్టు కు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ఖమ్మం కార్పొరేషన్ , సెప్టెంబర్ 19(జనంసాక్షి)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా బ్రాంచ్ యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటీసు, షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఏ. శ్రీనివాస్ శనివారం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 15 జిల్లా కార్యవర్గ సభ్యుల స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరగనున్నాయని, నామినేషన్ రుసుము రూ.10 వేలు (తిరిగి చెల్లించబడదు) గానిర్ణయించామన్నారు. ఎన్నికల నామినేషన్ల దాఖలు ఈ నెల 24 న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఐడిఓసి, కలెక్టరేట్, ఖమ్మం నందు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఈ నెల 25 న ఉదయం ఉంటుందని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 26 న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని, అర్హమైన నామినేషన్ల తుది జాబితాను ఈ నెల 26 న మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రకటిస్తామన్నారు. ఏకగ్రీవ అభ్యర్థుల ప్రకటన (పోటీ లేని పక్షంలో) ఈ నెల 26న సాయంత్రం 5 గంటల తర్వాత చేయనున్నట్లు ఎన్నికల అధికారి అన్నారు.పోలింగ్ ను అక్టోబర్ 4 న (ఆదివారం) ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 వరకు టీటీడీసీ భవనం, ఇల్లందు క్రాస్ రోడ్, రామాలయం దగ్గర, ఖమ్మం లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఉ ఆఫీస్ బేరర్ల ఎంపిక అక్టోబర్ 4 న పోలింగ్ ముగిసిన తదుపరి చేపట్టనున్నట్లు అన్నారు.నామినేషన్ పత్రాలను ఐడిఓసి, కలెక్టరేట్ ఖమ్మంలోని రూమ్ నెం: ఈ-27 ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం నందు పొందవచ్చని, పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ పత్రమును స్వయంగా మొదటి మరియు రెండవ ప్రపోజర్లతో కలిసి ఎన్నికల అధికారికి అందజేయాలని అన్నారు. ఒక వ్యక్తి ఒక్క అభ్యర్థికి మాత్రమే ప్రపోజర్గా (మొదటి లేదా రెండవ) ఉండాలని, నామినేషన్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను సమర్పించాలని అన్నారు. ఓటు వేయడానికి వచ్చే సభ్యులు తప్పనిసరిగా ఐఆర్సిఎస్ గుర్తింపు కార్డు / ఆధార్ కార్డు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు, ఓటర్ల జాబితా కొరకు ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎన్నికల అధికారి/ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.



## కాలువల్లో వ్యర్థాలు వేయొద్దు

### మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి

**హాలియా, జనం సాక్షి సెప్టెంబర్ 19:** హాలియా పురపాలక సంఘం పరిధిలోని సాగర్ రోడ్డులో ఉన్న పేరూరు ఎల్-1 మైనర్ కెనాల్‌లో కొనసాగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పనుల పురోగతిని పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలువల్లో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోకుండా పట్టణ ప్రజలు, దుకాణదారులు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. గృహ, వాణిజ్య వ్యర్థాలను కాలువల్లో వేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని సూచించారు.కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పట్టణ పరిశుభ్రత కోసం మున్సిపాలిటీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కాలువల్లో వ్యర్థాలను పడవేసే వారిని గుర్తించి, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



## యువ నేస్తం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**జాజిరెడ్డిగూడెం మండల జనంసాక్షి సెప్టెంబర్ 19:** జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని సూర్య నాయక్ తండాలో యువ నేస్తం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రకృతి గణేషుడు - పచ్చని పల్లె అనే అంశంపై గ్రామ సర్పంచ్ లూనావత్ కృష్ణ నాయక్ సహకారంతో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ఎం రమేష్, ఉపాధ్యాయుడు లింగయ్య, గద్దం వెంకన్న, వెంకటేష్, రవీందర్, నవీన్ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## కీతవారిగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**గరిడేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలోని ట్యాంక్ బజార్ కళావేదిక వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, 6వ వార్డు సభ్యులు మొగిలి సైదులు, 5వ వార్డు సభ్యురాలు భూతం సరిత నాగరాజు సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ ఖమ్మం వారి వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అత్యాధునిక పరికరా లతో కంటి పరీక్షలు చేసి కంటి సమస్యలు ఉన్నవారికి తగిన సలహాలు మందులను సూచించారు. అవసరమైన వారికి ఆపరేషన్ల నిమిత్తం హాస్పిటల్ కు రిఫర్ చేశారు.ఈ శిబిరానికి గ్రామానికి చెందిన వృద్ధులు, మహిళలు సహా 60 మందికి పైగా హాజరై ప్రయోజనం పొందారు.గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులను గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని నిర్వహించాలని గ్రామస్తులు కోరారు.

## గణనాథుని సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ



**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి:** మండలం కొరటికల్ గ్రామంలోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ (మారమ్మ) సన్నిధిలో నెలకొల్పిన శ్రీ గణనాథుని వద్ద అన్నప్రసాద కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాత శ్రీ రాగటి యాదగిరి? యాద లక్ష్మికుటుంబ సభ్యులు, కుమారులు, కోడ ళ్లు, మనుమలు, మనుమరాళ్ల సహకారం తో ఈ అన్నప్రసాద కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథు ని భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# రైతు బిడ్డకు న్యాయరంగంలో అరుదైన గౌరవం



**- తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా పత్తి విష్ణువర్ధన రెడ్డి..**

**- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచిన న్యాయ ప్రస్థానం..**

**బూర్గంపహాడ్ సెప్టెంబరు 19 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- సాధారణ రైతు కుటుంబం నుంచి న్యాయరంగంలోకి అడుగుపెట్టి, స్వీయ కృషి, క్రమశిక్షణ, పట్టుదల, న్యాయపట్ల అంకితభావంతో అంచెలంచెలుగా ఎదిగిన ప్రముఖ న్యాయవాది పత్తి విష్ణువర్ధన రెడ్డికు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ హైకోర్టు ఆయనను డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా అధికారికంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు మూడు దశాబ్దాల న్యాయ ప్రస్థానంలో ఆయన సాధించిన ఈ గుర్తింపు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ న్యాయవాద సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 28 ఏళ్ల సుదీర్ఘ న్యాయవాద అనుభవం కలిగిన విష్ణువర్ధన రెడ్డి హైకోర్టు నుంచి జిల్లా న్యాయస్థానాల వరకు వివిధ స్థాయిల్లో న్యాయ సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులకు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతకు సంబంధించిన కీలక కేసుల దర్యాప్తు చేసే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసెక్యూటర్‌గా సేవలందించారు.

**న్యాయవాదుల హక్కుల కోసం విశేష కృషి**

కోర్టు వాదనలకే పరిమితం కాకుండా న్యాయవాదుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలోనూ విష్ణువర్ధన రెడ్డి కీలక పాత్ర పోషించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా, నియమాల కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ న్యాయవాదుల సమస్యలు, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల్లో చురుకైన పాత్ర పోషించారు.అదేవిధంగా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహా ప్రతిష్టాత్మక జాతీయ న్యాయ విద్యాసంస్థల విద్యా సంబంధిత కార్యకలాపాల్లోనూ భాగస్వామిగా సేవలందించారు.

**- సుదీర్ఘ ప్రస్థానానికి దక్కిన గౌరవం.**

డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది హోదా సుదీర్ఘ వృత్తి అనుభవం, న్యాయపరిజ్ఞానం, వాదనా సామర్థ్యం, వృత్తిపరమైన ప్రతిష్ఠ, నైతిక విలువలు, న్యాయరంగానికి చేసిన సేవలు వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని అందించే ప్రత్యేక గుర్తింపు. నిర్దేశిత ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇంటర్వ్యూకు హాజరై, సంబంధిత కమిటీ పరిశీలన అనంతరం హైకోర్టు ఆమోదంతో విష్ణువర్ధన రెడ్డి ఈ గౌరవాన్ని పొందారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి స్వీయ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో దాదాపు మూడు దశాబ్దాల న్యాయ ప్రస్థానంలో ఉన్నత స్థాయికి ఎదగడం యువ న్యాయవాదులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఆయనకు లభించిన ఈ గౌరవం వ్యక్తిగత విజయంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా న్యాయరంగానికి ప్రత్యేక గుర్తిం పుగా పలువురు అభివర్ణిస్తు న్నారు. తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందిన పత్తి విష్ణువర్ధన రెడ్డికి పలువురు న్యాయవాదులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. న్యాయపరమైన అనుభవాన్ని భవిష్యత్తులోనూ న్యాయ పరిరక్షణ, న్యాయవాదుల సంక్షేమం, యువ న్యాయవాదులకు మార్గదర్శకత్వం వంటి రంగాల్లో వినియోగించాలని ఆకాంక్షించారు.



## ఎఫ్‌సీఐ గోడౌన్‌లో జలగం నగర్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

**ధాన్యం సేకరణ, నిల్వ విధానాలపై ప్రత్యక్ష అవగాహన**

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 19:(జనం సాక్షి )**



పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన నో బ్యాగ్ డే, పేరెంట్?టీచర్ మీటింగ్ (ఖఓ) కార్యక్రమాల్లో భాగంగా ఎదులాపూరం మున్సిపాలిటీ పరిధిలోని జలగం నగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈఅఎ) గోడౌన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా మిల్లర్ల నుంచి ధాన్యం సేకరించే విధానం, సేకరించిన ధాన్యాన్ని గోడౌన్లలో నిల్వ చేసే పద్ధతులు, నిల్వ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, ప్రకృతి విపత్తులు తదితర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఆహార ధాన్యాలను సరఫరా చేసే విధానం గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ఎఫ్‌సీఐ సిబ్బంది సంజయ్ తదితరులు విద్యార్థులను గోడౌన్‌లోకి తీసుకెళ్లి ధాన్యం నిల్వ ప్రక్రియను ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు.పాఠ్యాంశాల్లో చదివిన ఆహార భద్రత, ధాన్యం నిల్వ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించడంతో విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ సిబ్బంది విద్యార్థులకు స్నాక్స్ అందించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆర్. ఆదిలక్ష్మి, టీ. శంకరయ్య పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించిన ఎఫ్‌సీఐ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన పాఠశాల హెచ్ఎం శాంసన్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.



## వినాయక మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం

**నేరేడుచర్ల సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**

మున్సిపాల్టీ పరిధిలోని రామాపురం 07 వార్డులో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ గుడి దగ్గర వినాయక నవరాత్రి ఉత్సవాల భాగంగా గణేష్ మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, 07 వార్డు కౌన్సిలర్ వాసా జ్యోతి శేఖర్,మార్కెట్ చైర్మన్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి, చేపట్టారు.ముందుగా మండపంలో స్వామి వారిని దర్శించుకున్నారు.పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని అన్న తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ కమిటీ సభ్యులు పిల్లలమర్రి హరిబాబు, వెంకన్న, సైదిరెడ్డి యుగంధర్, సురేష్, నాగరాజు,నరేష్,శ్రీను, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ , దామోదర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**శ్రీసాయిగ్లోబల్ మల్టీ బ్రాండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ**

**సూర్యాపేట(జనంసాక్షి):**



శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసాయిగ్లోబల్ యాజమాన్యం వారు మట్టి వినాయకున్ని ప్రతిష్టించి పూజించడం, అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డు సమీపంలోని శ్రీసాయిగ్లోబల్ మల్టీబ్రాండ్ సర్వీసెస్ లో నిర్వహకులు దారపునేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు.అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాపర్తి భవానిశ్రీనివాస్, సర్పంచ్ లావుడ్య శ్రీలత బాలాజీ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస నాయుడు, వల్లెం శేఖర్, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, రేపాల శ్రీనివాస్, గొట్టిపర్తి శ్రీకాంత్, దారపునేని వెంకటేశ్వర్లు, రాజేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి,రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

జాజిరెడ్డిగూడెం మండల **(జనంసాక్షి):**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని అర్వపల్లి జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు పి. మల్లేష్ అన్నారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాభివృద్ధికి పలు సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, మధుకర్, శ్రీరాములు, విమల, ప్రసన్నకుమారి, రమేష్ కుమార్, శోభారాణి, నాగయ్య, వీరయ్య, అంజి, నాగమణి, ఇమామ్, వినయ్, పాల్గొన్నారు.



## హోమియో ఆసుపత్రికి వెంటనే డాక్టర్‌ను నియమించాలి

**ఆసుపత్రి ఎదుట ఏఐకేఎంఎస్, పీవైఎల్ ఆధ్వర్యంలో ధర్నా**

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**



పోచంపల్లి ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో వెంటనే రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీవైఎల్ పట్టణ కార్యదర్శి పగడాల శివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులు ఉన్నాయని, సిబ్బందికి 11 నెలలుగా వేతనాలు చెల్లించలేదని ఆరోపించారు. వెంటనే శాశ్వత వైద్యుడిని నియమించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని, సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకటేష్, కొత్తబాబు, రచ్చ వెంకటేష్, గోరుగంటి లింగయ్య, ఆర్.ఉదయ్, పోతగల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఏ రంగంలోనూ తక్కువ కాదు

**సెక్యూరిటీ విభాగంలో ప్రతిభను కనపరుస్తున్న మహిళలు**

**సింగరేణి ఇల్లందు ఏరియా జిఎం కృష్ణయ్య**

**టేకులపల్లి, సెప్టెంబర్ 19(జనంసాక్షి):**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా జనరల్ అస్సిసేంట్స్ లకు చెక్ పోస్టుల్లో విధులు కేటాయించగా, వారు సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారని, మహిళలు ఏ రంగంలోనూ తక్కువ కాదని, సెక్యూరిటీ విభాగంలోని అన్ని కీలక విధుల్లోనూ తమదైన ప్రతిభను చాటుతున్నారని ఇల్లందు ఏరియా జియం వి. కృష్ణయ్య అన్నారు.ఈ సందర్భంగా కోయగూడెం చెక్ పోస్టును జియం వి. కృష్ణయ్య శనివారం సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా జనరల్ అస్సిసేంట్స్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. చెక్ పోస్టు వద్ద లారీల రాకపోకలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, లారీ నంబర్, డ్రైవర్ పేరు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వివరాలను నమోదు చేయడంతో పాటు బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రైవర్లను పరీక్షించి అనంతరం లారీలను అనుమతిస్తున్న తీరును పరిశీలించారు.అదేవిధంగా లోడింగ్ అనంతరం లారీలోని బొగ్గు పరిమాణం, బరువు తదితర వివరాలను తనిఖీ చేసి లారీలను పంపిస్తున్న విధానాన్ని జియం పరిశీలించారు. మహిళా జనరల్ అస్సిసేంట్స్ బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా విధులు నిర్వహించడం పట్ల జియం సంతృప్తి వ్యక్తం చేశారు.మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, సింగరేణి సెక్యూరిటీ విభాగంలోని కీలకమైన ప్రదేశాల్లో కూడా మహిళా సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించడం అభినందనీయమని జియం పేర్కొన్నారు. సెక్యూరిటీ విభాగంలో మహిళలకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి , జూనియర్ ఇన్స్పెక్టర్ మల్లేష్,జమేదార్ ఈశ్వరయ్య, సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.





# అన్నదానం అభినందనీయం

- కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ తిరుపతిరెడ్డి.
- మూడవ వార్డులో ఘనంగా అన్నదానం..

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 19(జనంసాక్షి):**
భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. శనివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. తొలుత కమిటీ సభ్యుడు యాస లక్ష్మారెడ్డి కమిషనర్, ఏసీపీ, సీఐలకు వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు జరిపించి శాలువాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండటం అలవర్చుకోవాలన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమష్టిగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 9 నవరాత్రులు ఎంత భక్తి శ్రద్ధతో జరుపుకుంటారో, అదేవిధంగా నిమజ్జనాన్ని కూడా అంతే భక్తిశ్రద్ధలతో జరపాలని సూచించారు. అంతేకాకుండా నిమజ్జన ఏర్పాట్లలో అధికారుల నిబంధనలను పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానానికి భక్తులు స్థానిక వాసులు పెద్ద ఎత్తున హాజరై స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ముస్కరాజు, తిరుపతిరెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాల్లో నాసిరకం సరుకుల పంపిణీ

- పేద బిడ్డల కడుపు కొడుతున్న 'నేకాఫ్' కాంట్రాక్ట్ దందా
- రూ. 900 కోట్ల గురుకుల విద్యాలయాల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- అమ్మలా ఆదరించాల్సిన ప్రభుత్వమే నాసిరకం కూటితో విషం చిమ్ముతోంది
- తెలంగాణ బిసి, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ ఆగ్రహం

**ఖమ్మం కార్పొరేషన్,సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లల భవిష్యత్తుతో ప్రభుత్వం రాక్షసంగా ఆడుకుంటోందని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్, భీమ్ వారియర్స్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు బాగా చదువుకొని, పౌష్టికాహారం తిని ప్రయోజకులు అవుతారన్న నమ్మకంతో గురుకులాలకు పంపితే, ప్రభుత్వం మాత్రం కాసుల కక్కుర్తి కోసం కల్తీ సరుకులు పంపిణీ చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న 'నేకాఫ్' అనే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ. 900 కోట్ల నిత్యవసర సరుకుల కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవో నెం. 17ను రద్దు చేసి, ఈ దందాలపై 'సిట్' ఏర్పాటుచేసి, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

**కల్తీ ఆహారంతో క్యాన్సర్ ముప్పు :**
విద్యార్థులకు అందించే ఆహారంలో బ్రాండ్ లేని నాసిరకం గోధుమపిండి, గంటసేపైనా ఉడకని ఆఫ్రికన్ పప్పులు, కల్తీ నూనెలు సరఫరా చేస్తున్నారని నాయకులు మండిపడ్డారు. మార్కెట్‌లో కేజీ రూ. 50 ఉండే గోధుమపిండిని రూ. 66కి, రూ. 40 ఉండే చక్కెరను రూ. 60కి, రూ. 221 ఉండే ఎండుమిర్చిని రూ. 350 చొప్పున అధిక ధరలకు చూపిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నాసిరకం, కల్తీ ఆహారం తినడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో పాటు మానసిక ఆందోళనలు, శరీర ధృఢత్వం కోల్పోవడం, చివరికి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ?సంక్షేమ అధికారులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కూడిన కమిటీల ద్వారా నాణ్యమైన సరుకులు వచ్చాయో లేదో పరిశీలన చేసేవారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ కమిటీలను రద్దు చేసి సెంట్రలైజ్డ్ టెండర్ల పేరిట చిరు వ్యాపారుల పొట్ట కొడుతోందని విమర్శించారు. అధిక ధరల వల్ల విద్యార్థులకు వారానికి ఐదు రోజులు ఇవ్వాల్సిన గుడ్లను రెండు, మూడు రోజులకు కుదించి, అవి కూడా నాసిరకం (తక్కువ గ్రేడ్) గుడ్లను అందిస్తున్నారని ఆవేదన చెందారు.

**అదృశ్య శక్తుల చేతిలో 'నేకాఫ్'..**
గతంలో ప్రభుత్వ మార్క్‌ఫెడ్ డిపార్ట్‌మెంట్ చేత బ్లాక్ లిస్ట్‌లో పెట్టబడిన 'నేకాఫ్' సంస్థకు ఏ ప్రాతిపదికన మళ్లీ టెండర్లు ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నాయకులు నిలదీశారు. అసలు నేకాఫ్ వెబ్‌సైట్‌లో బాధ్యుల పేర్లు ఉండవని, దానికి ఎండీ ఎవరో, అసలు కార్యాలయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదని తెలిపారు. శ్రీనివాసరావు, మస్తాన్ రావు అనే వ్యక్తులు తెరవెనుక ఉండి ముడుపులు అప్పగించే పనిలో పడ్డారని, అధికారుల సమక్షంలోనే ఈ దోపిడీ జరుగుతోందని వారు ఆరోపించారు. ?తక్షణమే నాసిరకం సరుకుల కాంట్రాక్టును వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లా వేదికగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్ కంకణాల శ్రీనాథ్, స్వేరోస్ సీనియర్ నాయకులు దామెర్ల పృథ్వి రాజ్, బక్క వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, కోండ్రు రామచంద్రు, సోలెపోగు శ్యాంసుందర్, హాస్టల్స్ నాయకులు సాయి, ప్రేమ్ కుమార్, బహుజన నాయకుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- ఆపదలో అండగా.. అభివృద్ధిలో ముందుగా..
- ప్రజల గుండెల్లో ఉక్కు మహిళగా దూదిపాల రేఖా రెడ్డి



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**
కోట్లు ఆర్జించే అవకాశం ఉన్న ధన వ్యామోహం లేదు, సిరిసంపదల విలువ తెలిసినా కూడపెట్టాలన్న ఆశ లేదు, కీర్తి ప్రతిష్టలు వెంటాడుతున్నా అందిపుచ్చుకోవాలన్న జిజ్ఞాస లేదు, అత్యున్నత పదవులు అందుబాటులో ఉన్నా పదవీకాంక్ష లేదు, ఉన్న ధనమంతా ఇచ్చేసే దానగుణం, విజ్ఞానంపై తరగని అనురాగం, చరిత్ర సృష్టిస్తున్నా చరితకందని సౌశీల్యం, ప్రజలు బాగుపడాలన్న అపారమైన ప్రేమ, వేలాదిమంది జరుపుకునే మీ జన్మదిన వేడుక మీకు ఒక నామమాత్రపు వేడుక, ఎందరుంటారు ఇలా కోటికొక్కరైన మీలా మాటలో మానవత్వం నడకలో గంభీరం, ఆధరణలో అనురాగం పేరులో అభిమానం, మీ నవ్వులో స్నేహభావం సంపన్న కుటుంబంలో జన్మించి ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలు కొనసాగిస్తూ వేల మందికి తమ కంపెనీలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ పరుల కోసం పాటుబడుటుటమే తమ ధ్యేయం అంటూ ప్రజాక్షేమమే తన క్షేమమని తలచి ప్రజాక్షేత్రంలో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న మంచి మనసున్న ప్రజల మనిషి ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూదిపాల శ్రీధర్ రెడ్డి సతీమణి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ముద్దుల తనయ, కొండమల్లేపల్లి మండల మాజీ ఎంపిపి దూదిపాల రేఖ రెడ్డి జన్మదిన వేడుకలు మన కార్యాలయం మనందరి కార్యాలయంలో శనివారం అశేష జనవాహిని అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు అధ్యాపకులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపిపి దూదిపాల రేఖ రెడ్డి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి మండల అభివృద్ధి ప్రదాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేద ప్రజలంటే అత్యంత అమితంగా అభిమానించే అత్యంత ప్రజాధారణ కలిగిన ప్రజానేత కొండమల్లేపల్లి మండలంలో వందల సంఖ్యలో పేద ప్రజలకు తమ సొంత నిధులతో గృహ నిర్మాణాలు, పేద మధ్య తరగతి కుటుంబాల ఆడ పిల్లల పెళ్లిళ్లకు లక్షలాది రూపాలు సహాయం అందించిన గొప్ప మనస్సున్న, ప్రజలందరూ ఆరాధించి అభిమాన నాయకురాలు ప్రజల శ్రేయస్సు కొరకు కోట్ల రూపాయలు తమ సొంత నిధులు వెచ్చించి పార్టీలకు అతీతంగా కొండమల్లేపల్లి మండలాన్ని సుందరంగా తీర్చిదిద్దుతూ ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న మహా నాయకురాలు ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపి మరెన్నో కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తూ మండల అభివృద్ధే తమ శ్రేయస్సుగా మండలంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ అధికారులను ప్రజాప్రతినిధులను కోఆర్డినేట్ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసి ప్రజలందరి ఆశీర్వాదాలు దీవెనలు పొందుతున్న కొండమల్లేపల్లి మాజీ ఎంపిపి దూదిపాల రేఖ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ ప్రజాక్షేత్రంలో వారి విలువైన సేవలు ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు.

**కొండమల్లేపల్లి మండలానికి వారు చేసిన విశిష్ట సేవలు :**
కొండమల్లేపల్లి మండలంలో దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి దంపతులు రాజకీయాలకు అతీతంగా వారు చేసిన విశిష్ట సేవలు విద్యా రంగానికి, వైద్య రంగానికి, కొండమల్లేపల్లి పట్టణ, మండల కేంద్రంలోని పరిసర గ్రామాల అభివృద్ధికి, పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణం, బస్టాండ్ లోని రవాణా సౌకర్యానికి ఆర్థిక చేయూత, రహదారులు రవాణా సౌకర్యంలో ఎనలేని కృషి, జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు, మండల వ్యాప్తంగా మద్యం, డ్రగ్స్, గంజాయిపై అవగాహన సదస్సులు, చదువుకున్న యువతకు రాజకీయాలపై అవగాహన, ఉన్నత చదువులు చదువుకున్న విద్యార్థులకు ఆర్థిక చేయూత, మెటీరియల్ అందజేత, మౌలిక సమస్యలు ఎక్కడ ఉన్నా వెంటనే పరిష్కారం చేయడం, చదువుకున్న నిరుద్యోగులకు సొంత బిజినెస్ చేసుకునేలా ఆర్థిక ప్రోత్సాహం, పర్యావరణానికి విఘాతం కలగకుండా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం కొండమల్లేపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడం కోసం తమ సొంత నిధులు వెచ్చించి మండల అభివృద్ధిలో తమ సహకారాన్ని అందిస్తూ ప్రజలందరి దీవెనలు, ఆశీర్వాదాలు పొందుతున్న ఆదర్శ దంపతులు మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ దూదిపాల రేఖ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు.

## వినాయక నిమజ్జనానికి డీజే కు అనుమతులు లేవు- ఎస్ ఐ షాకీర్..

**ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయ మే ళాలతో వినాయక నిమజ్జనాన్ని నిర్వహించాలి**



**పెనుబల్లి సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
పెనుబల్లి మండల పరిధిలోని వినాయక నిమజ్జన కార్యక్రమాలకి డీజేలు నిషేధమని, అనుమతులు లేవని వి ఎం బంజర్ ఎస్ ఐ షాకీర్ తెలిపారు. విపరీతమైన శబ్ద కాలుష్యాలకు కారణమైన డీజీలపై నిషేధం ఉన్న కారణంగా అనుమతులు లేవని తెలిపారు, వినాయక విగ్రహ మండపాల నిర్వహకులు, భక్తులు, ప్రజలు గమనించాలని తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో, సాంప్రదాయ వాయిద్యాలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్ ఐ షాకీర్ మండల ప్రజలను కోరారు.

## అమ్మ పేరుతో మొక్కలు నాటిన పెనుబల్లి సర్పంచ్

**పెనుబల్లి సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
పెనుబల్లి గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ బాణోత్ పాప లక్ష్మి అమ్మ పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పెనుబల్లి ప్రాథమిక పాఠశాల, బీసీ కాలనీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## తిమ్మాపురంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**

తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆటో యూనియన్ సభ్యుడు రాచకొండ మహేష్ కుమార్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గ్రామ ఆటో యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మేడబోయిన శంకర్, జ్యోతుల సాయిల ఆధ్వర్యంలో యూనియన్ సభ్యుల సమక్షంలో మృతుడి కుటుంబీకులకు శనివారం రూ. 10వేలు ఆర్థికసాయంను అందజేశారు. ఆటో యూనియన్ సభ్యులలో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**



ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ గాలి సాయికిరణ్ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని 14వ వార్డు న్యూస్నేహ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాలి సాయికిరణ్ కావ్య దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల ఝాన్సీ రమేష్, ఈద ప్రవీణ్ , సిరివెళ్ల శబరినాథ్, గాలి శ్రీనివాస్ రమాదేవి దంపతులు, కాలనీ అభివృద్ధి కమిటి అధ్యక్షులు పుప్పాల వీరన్న, ప్రధాన కార్యదర్శి దామెర్ల లాలయ్య, కోశాధికారి తలిశెట్టి రవి , గౌరవ అధ్యక్షులు చిరగాని యాకయ్య , వర్కింగ్ ప్రెసిడెంట్ లు మందడి శ్రీకాంత్ రెడ్డి , పర్వతపు వీరాచారి, శ్రీకాంత్ వర్మ, ధరావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

చండూరు 3వ వార్డులో తాగునీటి కటకట

## మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో సీపీఐ నిరసన

**చండూరు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**

మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గత మూడు నెలలుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వార్డు ప్రజలతో కలిసి ఖాళీ బిందెలతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నలపరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని 3వ వార్డు ప్రజలకు గత మూడు నెలల నుంచి చుక్క నీరు రాక అల్లాడిపోతున్నారని మండిపడ్డారు. నిత్యం అవసరమైన తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి వస్తోందని, లేదా ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించి వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కుంభకర్ణ నిద్ర వీడి వెంటనే యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడకపోతే ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు, వార్డు ప్రజలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.





## విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమావేశం

**నేరేడుచర్ల సెప్టెంబర్19 (జనంసాక్షి):**

నేరేడుచర్ల పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులప్రగతి, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలతో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఇంటి వద్ద పిల్లల చదువును ప్రవర్తనలను నిరంతరం పరిశీలించాలని కోరారు. పాఠశాలలో డిజిటల్ బోధనా సౌకర్యాలు,కంప్యూటర్ విద్య, సైన్స్ ప్రయోగాల వినియోగం క్రీడలలో ప్రతిభ తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో ఆధునిక విద్యా సౌకర్యాలు కల్పిస్తూ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా మారిందని తగిన సమయం వెచ్చించి తల్లిదండ్రులు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమతో పాటు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

## లోయపల్లిలో సీఎం ఆర్ ఎఫ్ చెక్కు పంపిణీ

జాజిరెడ్డిగూడెం మండల **సెప్టెంబర్19 (జనంసాక్షి):**



మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన గెండెల రాజుకు వైద్య ఖర్చులకోసం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ద్వారా మంజూరైన రూ. 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు అంజి, శ్రీనివాస్ రెడ్డి, వీరభద్రి, ప్రసాద్, వెంకట్ రెడ్డి, పురుషోత్తం, లింగారెడ్డి, లింగయ్య, వెంకన్న, నర్సయ్య, కుశలవ రెడ్డి, సతీష్ , మహేష్, లతీఫ్, వంశీ, రాము తదితరులు పాల్గొన్నారు.

## జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

జాజిరెడ్డిగూడెం మండల **సెప్టెంబర్19 (జనంసాక్షి):**



జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అరుణ కంటి హాస్పిటల్ సూర్యాపేట వారి సౌజన్యము తో ఉచిత కంటి వైద్య శిబిరంను గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి గారు ప్రారంభించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ ఖర్చు తో ఆపరేషన్, కంటి అద్దాలు కూడ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్. వై శ్రీవాణి భావన, సైదులు వార్డు సభ్యులు బొల్లం సైదులు, వల్లాల ఖాజా, ఎలమాకంటి యాదగిరి, మండల ప్రవీణ్, మామిడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలైన ఓట్ల1401 అయితే కోర్టు పరిశీలనలో అదనంగా 7 ఓట్లు

### అధికారులకు అంతు పట్టని ఏడు ఓట్ల మతలబు..

### ఆశ్చర్యంలో అభ్యర్థులు

**కనగల్లు, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**

మండలంలోని చిన్న మాదారం గ్రామపంచాయతీలో 2025 డిసెంబర్ 11న జరిగిన సర్పంచ్ ఎన్నికలలో మొత్తం పోలైన ఓట్లు 1401 అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నమోదు చేయగా ఓట్ల లెక్కింపులో తేడాలు ఉన్నాయని పిండి భాగ్యమ్మ కోర్టును ఆశ్రయించింది. ఈ అంశంపై కోర్టు వాయిదాల మీద వాయిదాలు వేస్తూ శనివారం బ్యాలెట్ పత్రాలను తెప్పించి కోర్టు ఆవరణలో పరిశీలించగా అదనంగా ఏడు ఓట్లు ఉన్నట్లు గుర్తించడంతో పోలైన ఓట్లకు (1401)తేడా వచ్చిన(7) ఓట్లు కలిపితే 1408 ఓట్లు ఉండడంతో అక్కడికి వచ్చిన అభ్యర్థులతో పాటు అధికారులు కూడా ఆశ్చర్యపోయా రు. తుది తర్పును అక్టోబర్ 8 కి వాయిదా వేస్తున్నట్లు జడ్జి ఆదేశాలు జారీ చేశారు. వట్టి కోటి శిరీష సర్పంచి అభ్యర్థిగా ఫుట్బాల్ గుర్తుపై పోటీ చేసింది తేడా వచ్చిన ఓట్లు ఆమేగా ఉన్నట్లు గుసగుసలు . తేడా వచ్చిన ఏడు ఓట్లు ఎక్కడివని వాటిని నిగ్గు తేలుతాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పిండి భాగ్యమ్మ డిమాండ్ చేశారు.




## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రెండో రోజు దీక్ష

**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 19,(జనం సాక్షి):**

నల్లగొండ పట్టణ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఎజచిఏ?ఏఏజ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. దీక్షలకు డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత మాట్లాడుతూ వారం రోజుల్లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జర్నలిస్టుల డిమాండ్ న్యాయబద్ధమైనదని, పరిష్కారం కోసం మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన హయాంలో 113 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం నాలుగు ఎకరాల స్థలం కేటాయించి ప్లాట్లు సిద్ధం చేశామని, ఎన్నికల కారణంగా పట్టాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు దండంపల్లి సత్తయ్య, పాలడుగు నాగార్జున సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎజచిఏ?ఏఏజ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్‌రెడ్డి, యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జన్మదిన కానుకగా టీ-షర్టులు - ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

**మేళ్లచెరువు జనంసాక్షి**




కందిబండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా పనిచేస్తున్న షేక్ జాఫర్ తన జన్మదినాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. తన జన్మదిన సందర్భంగా పాఠశాల విద్యార్థులందరికీ సుమారు రూ. 12,000 విలువ చేసే స్పోర్ట్స్ టీ-షర్టులను బహూకరించారు. విద్యార్థుల్లో దాతృత్వ గుణాన్ని పెంపొందించడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేళ్లచెరువు మండల మాజీ వైస్ ఎంపీపీ గాయం గోపి రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు ఇలా విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం శుభ పరిణామమని, ఇది ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. గత సంవత్సరం కూడా ఇదే రోజున జాఫర్ గారు విద్యార్థులకు రూ. 6,000 విలువగల జామెట్రీ బాక్సులను అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ ఎస్సీఈఆర్టీలో స్టేట్ రిసోర్స్ పర్సన్ గా కూడా సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రోషి రెడ్డి, బాలరాజు, నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. టీ-షర్టులు అందుకున్న విద్యార్థులు జాఫర్ సార్ కు కృతజ్ఞతలు తెలిపారు.